రోడ్డుకు మోక్షమెప్పుడో..?

- ప్రతిపాదనలకే పరిమితం
- రహదారితో రెండు మండలాల అనుసంధానం
- పలు గ్రామాల్లోనూ తప్పని దారి కష్టాలు
- పట్టించుకోని ప్రభుత్వం


అంకూసాపూర్- ఎలకేశ్వరం మట్టి రోడ్డు

భీమారం: భీమారం – చెన్నూర్ మండలాలను అనుసంధానం చేసే రోడ్డు నిర్మాణ పనులు ప్రతిపాదనలకే పరిమితమయ్యాయి. భీమారం మండలం అంకూసాపూర్ నుంచి ఎలకేశ్వరం, ఎల్‌బీపేట మీదుగా చెన్నూరు మండలం సుద్దాల వరకు 8 కిలోమీటర్ల రోడ్డు నిర్మించేందుకు గత పదేళ్ల నుంచి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతున్నా ఇప్పటికీ నిధులు మంజూరు కాలేదు. దీంతో ఆయా మండలాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.
మంచిర్యాల –చెన్నూరు జాతీయరహదారి నుంచి పలు గ్రామాలకు రోడ్డు నిర్మించాలని ప్రజలు కోరుతున్నా ప్రభుత్వం మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుంది. అంకూసాపూర్ నుంచి ఎలకేశ్వరం వరకు 4కిలోమీటర్లు కేవలం మట్టిరోడ్డు మాత్రమే ఉండటంతో వర్షాకాలంలో రాకపోకలకు ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. కొన్నేళ్లుగా ఈ రోడ్డు నిర్మించాలని డిమాండ్ ఉన్నా ప్రభుత్వం పట్టించుకోలేదు. ఇంతలోనే రెండు మండలాలను కలిపే రోడ్డు నిర్మాణం చేపట్టాలని డిమాండ్ తెరపైకి వచ్చింది. దీంతో ఎలాగైనా రోడ్డు నిర్మాణం జరుగుతుందని ప్రజలు ఆశపడ్డారు. కానీ రోడ్డు పనులు ప్రతిపాదనలకే పరిమితమయ్యాయి.

ఎల్‌బీపేటకూ కష్టాలే..

మండలంలోని ఎల్‌బీపేట (లాల్‌బహదూర్‌పేట) నుంచి మండల కేంద్రానికి రావాలంటే సరైన రోడ్డు లేక చాలా మంది వివిధ పనుల నిమిత్తం చెన్నూరు మండలం కిష్టంపేటకు వెళ్తున్నారు. ఆ గ్రామంలో కూరగాయల పెంపకం ద్వారా అనేక కుటుంబాలు జీవనోపాధి పొందుతున్నాయి. వారు పండించిన కూరగాయలను మార్కెటింగ్ చేసేందుకు వెళ్లే భీమారం రహదారి అధ్వానంగా ఉండడంతో చెన్నూరు మండలం సుద్దాలవరకు వెళ్లి అక్కడి నుంచి మంచిర్యాలకు వెళ్తున్నారు. వర్షాకాలంలో సుద్దాల వరకు ఉన్న మట్టిరోడ్డు బురద మయంగా ఉంటుందని గ్రామస్తులు వాపోతున్నారు. రెండు మండలాలను కలిపే రోడ్డు నిర్మాణం పూర్తయితే భీమారం మండలం ఎలకేశ్వరం, లాల్‌బహదూర్‌పేట తోపాటు చెన్నూరు మండలం సుద్దాల, కమ్మరిపల్లి గ్రామాలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతాయని స్థానికులు పేర్కొంటున్నారు. రవాణా సదుపాయం ఉంటే భూములకు మంచి డిమాండ్ వస్తుందని, పండించిన కూరగాయలను పట్టణాలకు తరలించే అవకాశం కూడా మెరుగవుతుందని చెబుతున్నారు. ఎన్ని ప్రభుత్వాలు మారిన రోడ్ల పరిస్థితి మారడం లేదని ఆవేదన చెందుతున్నారు. మండలంలోని అన్ని గ్రామాలకు రోడ్డు సౌకర్యం కల్పించాలని, వేసవి కాలంలోనే రెండు మండలాలను కలిపే రోడ్డు పనులు సైతం పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

నిధులు విడుదల చేయాలి



రోడ్డు లేక ఎలకేశ్వరం ప్రజలు నానాకష్టాలు పడుతున్నాం. ఈ నేపథ్యంలో రెండు మండలాలను కలిపే రోడ్డుకి ప్రభుత్వం వెంటనే నిధులు విడుదల చేయాలి.

- పర్తిరెడ్డి శ్యాంసుందర్ రెడ్డి, ఎలకేశ్వరం

ఇబ్బందులు పడుతున్నాం



ఈప్రాంత ప్రజల కష్టాలకు చెక్ పెట్టేందుకు రోడ్డు నిర్మాణం కోసం వెంటనే నిధులు విడుదల చేయాలి. రోడ్డు లేక నానా ఇబ్బందులు పడుతున్నాం. చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి ప్రత్యేక చొరవ చూపి రోడ్డు నిర్మించాలి.

- బోగె సమ్మయ్య, ఎల్‌బీపేట

క్లుప్తంగా

నష్టపరిహారం అందజేత


చెక్ అందజేస్తున్న రత్నాకర్‌రావు

భీమారం: మంచిర్యాల అటవీడివిజన్ పరిధిలోని భీమారం మండలం దాంపూర్ గ్రామ సమీపంలో పెద్దపులి దాడిలో మృతి చెందిన గేదెకు సంబంధించిన రూ.15 వేల నష్టపరిహారం చెక్‌ను శుక్రవారం రేంజ్ ఆఫీసర్ రత్నాకర్ రావు రైతు రాజేందర్‌కు అందజేశారు. రత్నాకర్ రావు మాట్లాడుతూ పులి దాడి చేసి గేదెను చంపిన 24 గంటల లోపే అటవీశాఖ నష్టపరిహారం అందించిందన్నారు.

పాఠశాలలో 'బేటీ బచావో, బేటీ పడావో'

చెన్నూర్‌రూరల్: చెన్నూర్‌తో పాటు మండలంలోని సుద్దాల గ్రామంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో బేటీ బచావో, బేటీ పడావోపై శుక్రవారం విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా లింగ వివక్షత, లింగ సమానత్వం, బాల్య వివాహాల నిరోధక చట్టం, ఆన్‌లైన్ సేఫ్టీ, సైబర్‌క్రైమ్, మహిళ హెల్ప్‌లైన్ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. మహిళా సాధికారిక హబ్ జెండర్ స్పెషలిస్ట్ విజయ, లిప్సిక పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రం తనిఖీ

తాండూర్: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రాన్ని శుక్రవారం ప్రభుత్వ అధికారులు తనిఖీ చేశారు. తాండూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని తహసీల్దార్ ఇమ్రాన్‌ఖాన్, ఎంపీడీవో శ్రీనివాస్, సీఐ కుమారస్వామి, ఎస్సై కిరణ్‌కుమార్, డెప్యూటీ తహసీల్దార్ ప్రసాద్ ప్రత్యేకంగా ఏర్పాట్లను పర్యవేక్షించారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలని వినతి

చెన్నూర్‌రూరల్: మండలంలోని బావురావుపేట గ్రామంలోని ఆదివాసీ కాలనీలో తాగునీటికి ఇబ్బందులు పడుతున్నామని, సమస్యను పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం మంచిర్యాలలో అసిస్టెంట్ కలెక్టర్ మోతిలాల్‌కు ఆదివాసీ గిరిజన సంఘం(టీఏజీఎస్) నాయకులు సిడం సమ్మక్క, గావిడి బూదక్క, కుర్సింగ లక్ష్మీ, సిడం సునీతలు వినతిపత్రాన్ని అందజేశారు. బోరు ఎండిపోవడంతో గత మూడు నెలలుగా తాగునీటికి ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు పార్‌పల్లివాసి ఎంపిక


రఘువర్ధన్

కోటపల్లి: మండలంలోని పార్‌పల్లి గ్రామానికి చెందిన తలారి రఘువర్ధన్ రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు కోచ్ ప్రేంకుమార్ తెలిపారు. ఈనెల 12న నస్పూర్‌లోని ప్రాణహిత స్టేడియంలో జరిగిన జిల్లాస్థాయి కబడ్డీ పోటీల్లో ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యాడు. ఈనెల 21 -23వరకు 34వ రాష్ట్రస్థాయి సబ్‌జూనియర్ కబడ్డీ పోటీల్లో పాల్గొంటారని కోచ్ తెలిపారు. రఘువర్ధన్‌ను సీనియర్ క్రీడాకారులు రాజేశ్, శ్రావణ్, రఘు, రాజశేఖర్, రాహుల్ అభినందించారు.

సబ్‌జైలులో వైద్య శిబిరం

లక్సెట్టిపేట: మండల కేంద్రంలోని సబ్‌జైలులో ప్రభుత్వ సివిల్ ఆసుపత్రి ఆధ్వర్యంలో అధికారులు వైద్య శిబిరం నిర్వహించారు. అండర్ ట్రయల్ ఖైదీలకు వ్యాధులపై అవగాహన కల్పించారు. వైద్యాధికారి సురేశ్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. అనంతరం హెచ్‌ఐవీ, టీబీ, పలు రకాల వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో జైలర్ స్వామి, వైద్య సిబ్బంది అంజనేయులు, మహేశ్, సురేశ్‌లు పాల్గొన్నారు.

నేడు టీఎన్జీవోస్ సమావేశం

మంచిర్యాలటౌన్: అఖిల భారత రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమాఖ్య జాతీయ ఉపాధ్యక్షుడు, టీఎన్జీవోస్ కేంద్ర సంఘం అధ్యక్షుడు మారం జగదీశ్వర్ శనివారం జిల్లా పర్యటన నిమిత్తం సాయంత్రం 5 గంటలకు టీఎన్జీవోస్ భవన్‌లో సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు టీఎన్జీవోస్ అధ్యక్ష, కార్యదర్శులు గడియారం శ్రీహరి, భూముల రామ్మోహన్‌లు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా నాయకులు, సభ్యులు సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు.

రోడ్డు పైకి నీరు..!



దండేపల్లి: మండల కేంద్రం సమీపంలో డిస్ట్రిబ్యూటరీ 28 కాలువలో శుక్రవారం చెత్తతట్టి నీరంతా రోడ్డుపై పారింది. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. అధికారులు గమనించి చెత్తను తొలగించి నీరు రోడ్డుపైకి రాకుండా చర్యలు చేపట్టారు.

వింత వ్యాధితో నాటుకోళ్ల మృత్యువాత


గంగారాంలో మృతి చెందిన కోళ్లతో రైతు

నెన్నెల: గత పదిహేను రోజులుగా మండలంలో నాటు కోళ్లు వింత వ్యాధితో మృత్యువాత పడుతున్నాయని పెంపకందారులు ఆందోళన చెందుతున్నారు. నెన్నెల, లంబాడితండా, మన్నేగూడం, జంగాల్‌పేట, గంగారాం, మైలారం గ్రామాల్లో సుమారు 5 వేలకుపైగా కోళ్లు మృతి చెందినట్లు రైతులు చెబుతున్నారు. నాటుకోడి ధర కిలో రూ.450 పలుకుతుందని, వేలాది కోళ్లు చనిపోవడంతో ఆర్థికంగా నష్టపోతున్నామని వాపోతున్నారు. ఎలాంటి రోగ లక్షణాలు లేకున్నా ఆకస్మాత్తుగా మృతిచెందుతున్నాయని, మందులు వాడినప్పటికీ ప్రయోజనం ఉండడం లేదన్నారు. నెన్నెల పశువైద్యాధికారి చందన్‌కుమార్‌ను సంప్రదించగా కొక్కెర వ్యాధితో కోళ్లు మృతి చెందుతున్నాయని, ఆర్‌డీ వ్యాక్సిన్ వేయించాలని సూచించారు.

వినూత్నంగా ఇంటి పన్ను వసూలు


డప్పు చాటింపు చేస్తూ పన్ను వసూలు చేస్తున్న అధికారులు

తాండూర్: ఇంటి పన్ను వసూలు వందశాతం సాధించాలనే లక్ష్యంతో తాండూర్ గ్రామ పంచాయతీ అధికారులు వినూత్న చర్యలు చేపట్టారు. శుక్రవారం గ్రామపంచాయతీ ప్రత్యేక అధికారి, ఎంపీడీవో శ్రీనివాస్ ఆధ్వర్యంలో పంచాయతీ సిబ్బంది ఇంటింటికి తిరుగుతూ పన్ను వసూలుకు శ్రీకారం చుట్టారు. ఇళ్ల ముందుకు వెళ్లి డప్పు చాటింపు చేస్తూ ఇంటి పన్ను చెల్లింపుల కోసం అవగాహన కల్పించారు. ఇంటి ముందుకు వచ్చిన సిబ్బందికి పన్ను చెల్లించడానికి ఇళ్ల యజమానులు ఆసక్తి చూపారు. వినూత్న పద్ధతి ద్వారా కేవలం రెండున్నర గంటల్లోనే రూ.లక్ష వరకు పన్ను వసూలు కావడం గమనార్హం. ఎంపీడీవో శ్రీనివాస్ మాట్లాడుతూ. మార్చి నెలఖారు వరకు వంద శాతం పన్ను వసూలు చేయడానికి చర్యలు తీసుకుంటున్నామని, ఇప్పటి వరకు 48 శాతం పన్ను వసూలైందని పేర్కొన్నారు. ఈవో దొండ దివాకర్, గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

'నరేందర్ రెడ్డికే పట్టం కట్టండి'


మాట్లాడుతున్న ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి

చెన్నూర్: కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు పెరిగాయని, కాంగ్రెస్ బలపర్చిన అభ్యర్థి నరేందర్ రెడ్డికే పట్టం కట్టాలని చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు. స్థానిక ఎంఆర్‌ఆర్ గార్డెన్‌లో శుక్రవారం పట్టభద్రుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. సమ్మేళనానికి పెద్దపల్లి ఎంపీ వంశీకృష్ణతో కలిసి హాజరయ్యారు. ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

'బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించాలి'

కాసిపేట: బీజేపీ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి అంజిరెడ్డిని మొదటి ప్రాధాన్యత ఓటువేసి గెలిపించాలని మాజీ ఎమ్మెల్యే శ్రీదేవి, ఎమ్మెల్సీ ఎన్నికల ఇన్‌చార్జి వెంకటరమణ కోరారు. శుక్రవారం మండలంలోని పెద్దనపల్లిలో పట్టభద్రులను కలిసి ప్రచారం నిర్వహించి కరపత్రాలు పంపిణీ చేశారు. మండలాధ్యక్షుడు సూరం సంపత్ కుమార్, కార్తీక్, చొప్పదండి విష్ణువర్ధన్, మహేందర్, కమల, సంగీత, స్రవంతి ఉన్నారు.

చెన్నూర్: పట్టభద్రులు, ఉపాధ్యాయుల పక్షాన శాసన మండలిలో మాట్లాడేందుకు బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థి అంజిరెడ్డిని గెలిపించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్‌గౌడ్ అన్నారు. చెన్నూర్ ఉన్నత పాఠశాల మైదానంలో ఉదయం వాకర్స్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. తిరుపతి, సమ్మయ్య, లక్ష్మీనారాయణరెడ్డి, వెంకటనర్సయ్య, శ్రీపాల్, శ్రీనివాస్,సత్యం పాల్గొన్నారు.

వేమనపల్లి: ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, మెదక్ నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పట్టభద్రులు, టీచర్స్ అభ్యర్థులుగా పోటీ చేస్తున్న అంజిరెడ్డి, మల్కె కొమురయ్యలకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని బీజేపీ మండల అధ్యక్షుడు ఏట మధుకర్ ప్రచారం నిర్వహించారు. ప్రధాన కార్యదర్శి వెంకటేశ్, బీజేవైఎం మండల అధ్యక్షుడు అజయ్‌కుమార్, రవి పాల్గొన్నారు.

బెల్లంపల్లి: బెల్లంపల్లి మున్సిపాలిటీలో శుక్రవారం తమ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థుల పక్షాన బీజేపీ శ్రేణులు ప్రచారం చేశారు. అభ్యర్థులు మల్క కొమురయ్య, అంజిరెడ్డిలకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అధిక మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను కోరారు. మున్సిపాలిటీ పరిధిలోని 2, 17, 18వ వార్డుల్లో ఇంటింటా తిరిగి ప్రచారం చేశారు. బీజేపీ అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ రాచర్ల సంతోష్‌కుమార్, నాయకులు మద్దెర్ల శ్రీనివాస్, కె.గోవర్ధన్, రాకేశ్, చంద్రమౌళి పాల్గొన్నారు.

మేదరిపేటలో ఎమ్మెల్సీ అభ్యర్థి ప్రచారం

దండేపల్లి: ఉమ్మడి కరీంనగర్, నిజామాబాద్, మెదక్, ఆదిలాబాద్ పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ స్వతంత్ర అభ్యర్థి డాక్టర్ నిమ్మతోట వెంకటేశ్వర్లు, దండేపల్లి మండలం మేదరిపేటలో శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని పట్టభద్రులను కోరారు.

'రవీందర్‌సింగ్‌కు అవకాశం ఇవ్వండి'

వేమనపల్లి: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకుడు సర్దార్ రవీందర్‌సింగ్‌కు ఓటు వేసి గెలిపించాలని బీఆర్‌ఎస్‌వీ మండల అధ్యక్షుడు బుర్రి రమేశ్ కోరారు. మండలంలోని ముల్కలపేటలో ప్రచారం నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర ఉద్యమకారుడు, న్యాయవాది ప్రజా సమస్యలపై అవగాహన ఉన్న వ్యక్తిగా సర్దార్ రవీందర్ సింగ్‌కు ఓటు వేయాలని కోరారు. మాజీ సర్పంచ్ రాజలింగు, గ్రామస్తులు పాల్గొన్నారు.

'టీచర్స్ ఎమ్మెల్సీగా గెలిపించండి'

జన్నారం: ఉపాధ్యాయుల సమస్యలపై నిరంతరం పోరాడుతున్న తనను టీచర్స్ ఎమ్మెల్సీగా గెలిపించాలని అభ్యర్థి తిరుమల రెడ్డి ఇన్నారెడ్డి కోరారు. శుక్రవారం ప్రచారంలో భాగంగా మండల కేంద్రంలో మాట్లాడారు.

డీఈవో తనిఖీ

లక్సెట్టిపేట: మున్సిపాలిటీ పరిధిలోని ముల్కల్లగూడ ప్రాథమిక పాఠశాలను జిల్లా విద్యాధికారి యాదయ్య శుక్రవారం తనిఖీ చేశారు. ఆవరణలోని మౌలిక సదుపాయాలు, వంటగదిని పరిశీలించారు. విద్యార్థులకు మంచి విద్యాబోధన, రుచికరమైన భోజనం అందించాలని తెలిపారు. విద్యార్థులతో మాట్లాడి చదువు పురోగతి, పాఠ్యాంశాలపై తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో ఎలెన్ ధారతి, సెక్టోరల్ అధికారి చౌదరి పాల్గొన్నారు.

ముగిసిన లోకో పైలెట్ల నిరసన దీక్ష

బెల్లంపల్లి: సమస్యలు పరిష్కరించాలని రన్నింగ్ స్టాఫ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రైల్వే లోకో పైలెట్లు చేపట్టిన 36గంటల నిరసన దీక్ష శుక్రవారం ముగిసింది. అసోసియేషన్ బెల్లంపల్లి బ్రాంచ్ అధ్యక్ష, కార్యదర్శులు ఏకే పటేల్, అజయ్‌కుమార్ మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న లోకో పైలెట్ల సమస్యలను రైల్వే అధికారులు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. రన్నింగ్ అలవెన్స్ పెంపు, ఆదాయపు పన్ను మినహాయింపు వంటి సమస్యలు పరిష్కరించాలని అన్నారు. సమస్యలు పరిష్కరించే వరకు పోరాటాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు. నాయకులు ఏకే.మౌర్య, రవీందర్ రామ్, ప్రియాన్స్ దనవ్, లోకో పైలెట్లు పాల్గొన్నారు.

దివ్యాంగుడి కుటుంబానికి చేయూత

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని తిలక్‌నగర్‌లో గల అమృతహస్తం వెల్ఫేర్ సొసైటీలో ఉంటున్న దివ్యాంగుడు ముడుసు లక్ష్మణ్ ఇటీవల గుండెపోటుతో మృతి చెందగా, తోటి దివ్యాంగులు బాధిత కుటుంబానికి శుక్రవారం రూ.20 వేల ఆర్థిక సాయం అందించారు.

వివాహానికి ఆర్థికసాయం

జన్నారం: పేదింటి అమ్మాయి వివాహానికి గ్రామ యువకులు సహాయం అందించి ఉదారత చాటుకున్నారు. చింతగూడ గ్రామానికి చెందిన సంపంగి అంజన్న –లక్ష్మీల కూతురు రజితకు వివాహం నిశ్చయమైంది. వివాహ ఖర్చు కోసం యువకులు, నాయకులు విరాళాలు సేకరించి రూ.15000 లను శుక్రవారం వారికి అందజేశారు.

ప్రమాదాల నివారణకు చర్యలు

శ్రీరాంపూర్: రోడ్డు ప్రమాదాల నివారణకు పలు చర్యలు చేపడుతున్నట్లు శ్రీరాంపూర్ సీఐ వేణుచందర్ తెలిపారు. కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా ఆయన తన సిబ్బందితో కలిసి అరుణాకర్ నగర్ టర్నింగ్ వద్ద ఉన్న చెట్ల పొదలను ట్రాక్టర్‌తో తొలగించారు. ఆయన మాట్లాడుతూ చెట్లపొదల అడ్డుగా ఉండటం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. వాహనదారులు ట్రాఫిక్ నియమాలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఎస్సై సంతోష్ పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు అవగాహన


అవగాహన కల్పిస్తున్న బన్సీలాల్

మందమర్రిరూరల్: ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు ఇంటి నిర్మాణ పనులు చేపట్టాలని జిల్లా హౌజింగ్ కార్పొరేషన్ ప్రాజెక్ట్ డైరెక్టర్ బన్సీలాల్ సూచించారు. శుక్రవారం మండలంలోని పొన్నారం గ్రామంలో ఎంపీడీవో రాజేశ్వర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో అవగాహన కల్పించారు. పనులపై దశలవారీగా లబ్ధిదారులకు ప్రభుత్వం డబ్బులు చెల్లిస్తుందన్నారు. పంచాయతీ కార్యదర్శి, టెక్నికల్ అసిస్టెంట్, ఉపాధి హామీ సిబ్బంది ఉన్నారు.

ఘనంగా మహా కుంకుమార్చన


పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి

రామకృష్ణాపూర్: క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలోని కొత్త తిమ్మాపూర్ శివారులో గల శ్రీ జగదాంబేశ్వర ఆశ్రమంలో జగదాంబ సహిత పరమేశ్వర విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మహా కుంకుమార్చన వైభవంగా నిర్వహించారు. కుంకుమార్చనతో పాటు శ్రీ మహాలక్ష్మి లలిత, రాజశ్యామలా హోమం నిర్వహించారు. ఈ ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి పాల్గొని మొక్కులు చెల్లించారు. అనంతరం నూతనంగా ప్రతిష్ఠించనున్న దేవతామూర్తులను, యాగశాలను ఎమ్మెల్యే సందర్శించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, భక్తులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

భక్తులకు ఇబ్బందులు లేకుండా చూడాలి..

జైపూర్: వేలాలలో ఈ నెల 26న మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని మూడు రోజుల పాటు నిర్వహించనున్న శ్రీ మల్లన్న స్వామి జాతరకు తరలివచ్చే భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా సౌకర్యాలు కల్పించాలని ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి తెలిపారు. జైపూర్ మండలం వేలాలలో జాతర సందర్భంగా చేపడుతున్న ఏర్పాట్లను శుక్రవారం పరిశీలించారు. గుట్టపై, కింద భక్తులకు కల్పించే సౌకర్యాలు, వాహనాల పార్కింగ్, సులభ దర్శనం వంటి ఏర్పాట్లపై అధికారులతో చర్చించారు. అన్నిశాఖల అధికారులు సమన్వయంతో జాతరను విజయవంతం చేయాలన్నారు.

ఆలయ పునఃనిర్మాణానికి నిధులు మంజూరు చేయాలి


వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే వినోద్

బెల్లంపల్లి: బెల్లంపల్లి బజారు ఏరియా ప్రాంతంలో ఉన్న శ్రీపోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయ పునఃనిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే గడ్డం వినోద్ కోరారు. శుక్రవారం సచివాలయంలో విశ్వబ్రాహ్మణుల పక్షాన దేవాదాయ శాఖ రాష్ట్ర అధికారి సోమరాజుకు వినతిపత్రం అందజేసి, రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండ సురేఖతో ఎమ్మెల్యే ఫోన్‌లో మాట్లాడారు. నిధుల మంజూరుకు అధికారులు సానుకూలంగా స్పందించినట్లు విశ్వబ్రాహ్మణులు తెలిపారు. దేవాలయ ధర్మకర్త అక్కనిపెల్లి సత్యనారాయణ, బెల్లంపల్లి పట్టణ స్వర్ణకారుల సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్, పూసాల శ్రీనివాస్, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ


కాలనీవాసులతో సీఐ శశిధర్‌రెడ్డి

మందమర్రిరూరల్: సీసీ కెమెరాలను కాలనీల్లోని కూడళ్లలో ఏర్పాటు చేసుకుంటే నేరాల నియంత్రణ సులభతరమని మందమర్రి సీఐ శశిధర్‌రెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని అంగడిబజార్ ఏరియాలో గత నెల రోజుల కిందట సీసీ కెమెరాల వినియోగంపై అవగాహన కల్పించగా కాలనీవాసులు నాలుగు కెమెరాలు ఏర్పాటు చేసుకున్నారు. వాటిని శుక్రవారం ఎస్సై రాజశేఖర్‌తో కలిసి సీఐ ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఐ కాలనీ వాసులను అభినందిస్తూ పట్టణంలోని అన్ని కాలనీల్లోని కూడళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుని పోలీసులకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో కాలనీవాసులు రాచర్ల రవికుమార్, గణేశ్, భాస్కర్ తదితరులు ఉన్నారు.

ఘనంగా మాతృభాషా దినోత్సవం

మంచిర్యాలఅర్బన్: స్థానిక సాంఘిక సంక్షేమ మహిళ డిగ్రీ కళాశాలలో తెలుగు శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్, పాటలు, ఉపన్యాస పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ అనూష, అధ్యాపకులు కవితారాణి, రిజ్వాన, జ్యోతి, శైలజ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో..

స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ మాతృభాష దినోత్సవం ఘనంగా నిర్వహించారు. తెలుగు విభాగం తెలంగాణ క్షేత్రాలు- అక్షర దర్శనం అనే అంశంపై జాతీయ సదస్సుకు ఎంపికైందని తెలంగాణ హయ్యర్ ఎడ్యుకేషన్ కౌన్సిల్ నుంచి అనుమతి కూడా లభించిందని కళాశాల ప్రిన్సిపాల్ చక్రపాణి తెలిపారు. తెలుగు విభాగాధిపతి ఎస్.హరీశ్, వైస్ ప్రిన్సిపాల్ నరేందర్ రెడ్డి, స్టాఫ్ సెక్రటరీ గోపాలకృష్ణ, అకాడమిక్ కోఆర్డినేటర్ గంగయ్య తదితరులు పాల్గొన్నారు.

మాతృభాషను మరువొద్దు

బెల్లంపల్లి: ఎంత ఉన్నత స్థాయికి ఎదిగినా మాతృభాషను ఎట్టిపరిస్థితుల్లోనూ మరిచి పోవద్దని బెల్లంపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కాంపల్లి శంకర్ అన్నారు. శుక్రవారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు మాతృభాషను తప్పక గౌరవించాలని సూచించారు. విద్యార్థులు మాతృభాషలో విద్యను కొనసాగిస్తూనే ఇతర భాషల్లో నైపుణ్యం కనబర్చాలన్నారు. కళాశాల తెలుగు విభాగం అధ్యక్షుడు తమటం రేణుబాబు గౌడ్, అధ్యాపకులు మురళీకృష్ణ, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

మైనింగ్ స్టాఫ్ సమస్యల పరిష్కారానికి కృషి


సమస్యలు తెలుసుకుంటున్న నాయకులు

జైపూర్: సింగరేణి మైనింగ్ స్టాఫ్ సమస్యలను యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని ఏఐటీయూసీ బెల్లంపల్లి రీజియన్ మైనింగ్ స్టాఫ్ సెక్రెటరీ వంగరి రాజేశ్వరావు, శ్రీరాంపూర్ ఏరియా మైనింగ్ స్టాఫ్ ఉపాధ్యక్షుడు బాలకృష్ణ తెలిపారు. జైపూర్ మండలం ఇందారం ఐకే1ఏ గనిపై శుక్రవారం మైనింగ్ స్టాఫ్ సమస్యలు తెలుసుకున్నారు. 2016 బ్యాచ్ జేఎంఈటీల ప్రమోషన్లు, చార్జ్ అలవెన్స్, బంగ్లాకిప్ అప్ అలవెన్స్, ఓసీ కౌన్సెలింగ్‌లో పాల్గొన్న ఓవర్‌మెన్‌లకు ఓసీ రిలీవింగ్, ఎమ్మెల్సీ ఎలక్షన్ కోడ్ అని చెప్పి ఆపిన ప్రమోషన్లు తదితర సమస్యలను పరిష్కరించాలన్నారు. శనివారం సాయంత్రం 5గంటలకు నర్సయ్య భవన్‌లో ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు సీతారామయ్య ఆధ్వర్యంలో నిర్వహించే సమావేశాన్ని కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. నాయకులు ప్రశాంత్, శ్రీనివాస్‌రెడ్డి, వెంకటేశ్, శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

అధికారులకు సన్మానం


డైరెక్టర్, జీఎంలను సన్మానిస్తున్న నాయకులు

శ్రీరాంపూర్: సింగరేణి నూతన డైరెక్టర్(పీపీ) కొప్పుల వెంకటేశ్వర్లు, శ్రీరాంపూర్ ఏరియా నూతన జీఎం శ్రీనివాస్‌లను గుర్తింపు సంఘం ఏఐటీయూసీ నాయకులు ఘనంగా సన్మానించారు. శుక్రవారం జీఎం కార్యాలయం వద్ద ఏఐటీయూసీ అధ్యక్షుడు సీతారామయ్య శాలువాతో సత్కరించారు. ఏరియాలో ఉన్న ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. యూనియన్ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి ముస్కె సమ్మయ్య, బ్రాంచ్ కార్యదర్శి బాజీసైదా, ఉపాధ్యక్షుడు కొట్టె కిషన్ రావు, అసిస్టెంట్ కార్యదర్శి మోత్కూరు కొమురయ్య నాయకులు పాల్గొన్నారు.

క్వార్టర్లకు కౌన్సెలింగ్

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ ఏరియాలో ఖాళీగా ఉన్న క్వార్టర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ప్రగతి మైదానంలోని సీఈఆర్ క్లబ్‌లో శుక్రవారం ఏరియా ఎస్‌ఓటు జీఎం సత్యనారాయణ ఆధ్వర్యంలో కౌన్సెలింగ్ నిర్వహించారు. ఉద్యోగులకు సీనియారిటీ, హోదా ఆధారంగా క్వార్టర్లను కేటాయించారు. ఖాళీగా ఉన్న 259 క్వార్టర్లకు గాను 230 మంది ఉద్యోగులు దరఖాస్తు చేసుకోగా 78 మంది కౌన్సెలింగ్‌లో క్వార్టర్లను పొందారు. పర్సనల్ మేనేజర్ రాజేశ్వర్, సివిల్ ఈఈ గుండెరావు, డిప్యూటీ పర్సనల్ మేనేజర్ దేవేందర్ రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ ఎల్. శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.